# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 4, ఫిబ్రవరి 2026


### మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ

# పకడ్బందీగా చేపట్టాలి

● మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా తయారీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని, నిర్దేశిత సమయంలోగా ప్రక్రియ పూర్తి చేసి నిబంధనల ప్రకారం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తిగా వీడియోగ్రఫీ చేయడం జరిగిందని మిగతా 2లో..

# ఎన్నికల భద్రతకు పోలీసుల భారీ ఫ్లాగ్‌మార్చ్



**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కాగజ్‌నగర్ పట్టణంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ స్వయంగా పాల్గొని పోలీసు సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ప్రజల్లో భద్రతా భావం కల్పించడం, అసాంఘిక శక్తుల కదలికలను అరికట్టడం, సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తత పెంపొందించడం ఈ ఫ్లాగ్‌మార్చ్ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఫ్లాగ్‌మార్చ్ కాగజ్‌నగర్ పట్టణంలోని కౌసర్‌నగర్ ప్రాంతంలో ప్రారంభమై వార్డులు 7, 8, 9, 24 ప్రధాన వీధుల వెంట కొనసాగింది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలు సమన్వయంతో పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పోలీసుల చర్యలను అభినందిస్తూ శాంతి భద్రతలపై నమ్మకం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి అభ్యర్థి, రాజకీయ పార్టీలు కచ్చితంగా పాటించాలని ఆమె స్పష్టం మిగతా 2లో..

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వివిధ వార్డులు, పలు విభాగాలను పరిశీలించి, చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్త నిల్వ గదిని పరిశీలించి వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై విచారించి మిగతా 2లో..

# కుక్కల దాడిలో 8మందికి గాయాలు





**తాండూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ఆంధ్ర బ్యాంకు అండర్ పాస్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం 8 మంది పై కుక్కలు దాడిలో గాయపడ్డారు. లక్ష్మణ్, మిగతా 2లో..

### పంట ఉత్పత్తుల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో

# సిద్ధంగా ఉండాలి

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**

జిల్లాలో వరి ధాన్యం, పత్తి పంటల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్యతో కలిసి జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, మెప్మా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం, పత్తి పంటల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో పత్తి పంట దిగుబడి అంచనా వేయాలని, తదనగుణంగా కొనుగోలు కొరకు ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు కొనుగోలు ప్రక్రియలో భాగంగా మిగతా 2లో..



## ఎన్నికల భద్రతకు పోలీసుల భారీ ఫ్లాగ్‌మార్చ్

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. నియమావళి ఉల్లంఘనకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించరాదని సూచించారు. ఓటర్లను డబ్బులు, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలతో ప్రభావితం చేయడం నేరమని పేర్కొన్నారు.ప్రజలు ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, గందరగోళం సృష్టించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల పరిధిలో నాలుగు ప్రధాన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెల్లడించారు. సమస్యాత్మక వార్డులపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు బలగాలను మోహరించనున్నట్లు చెప్పారు.ఎన్నికల సమయంలో ప్రజా భద్రతకు భంగం కలిగించే ఏ చర్యలకైనా పోలీసులు తక్షణమే స్పందించేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు అవసరమైన సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవచ్చని సూచించారు. జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొల్పి ప్రతి ఓటరు భయభ్రాంతులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, ఇన్‌స్పెక్టర్లు ప్రేమ్‌కుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు సుధాకర్, చంద్రశేఖర్, సందీప్, సురేష్, కళ్యాణ్, రాజు, అనిల్ తదితరులు, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలు పాల్గొన్నారు. ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేవారిలో సామాన్యులు, ఆదివాసి గిరిజనులు ఎక్కువగా ఉంటారని, వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. రోగుల ఆరోగ్య స్థితిగతులపై వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు ప్రవీణ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సుబోధ్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై ఎంపిడిఓ సమీక్ష

పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :



మండల పరిషత్ కార్యాలయం పెంచికల్‌పేట్‌లో మంగళవారం ఎంపిడిఓ ఆల్బర్ట్ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే మంజూరైన ఇండ్ల పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. అలాగే నూతనంగా మంజూరైన గ్రామా పంచాయతీ భవనాల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలలోని నర్సరీలు, పాఠశాలల్లో నిర్మిస్తున్న కిచెన్ షెడ్లు, టాయిలెట్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు నిరంతరంగా సాగాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి మహేందర్, ఏపీఓ సతీష్ మండలంలోని కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా క్లెయిమ్ అందజేత

పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త



పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన డోకె లక్ష్మి, గోలేటి దుర్గబాయి అనారోగ్యంతో మృతి చెందగా, వారి నామినీలైన డోకె నారాయణ, దుర్గం రాజన్నలకు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద క్లెయిమ్ డబ్బులను ఎల్కపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గోపికిషోర్, దహెగాం సిఎఫ్ఎల్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ గోపికిషోర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ తీసుకోవడం అవసరమని, తక్కువ ప్రీమియంతో కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుందని తెలిపారు. అలాగే 10 సంవత్సరాలుగా వినియోగం లేని ఖాతాలు క్లెయిమ్ కాని డిపాజిట్లు ఆర్బీఐ డీఈఏఎఫ్ ఫండ్ కు బదిలీ అవుతాయని, వాటిని ఉద్గమ్ పోర్టల్ ద్వారా తిరిగి పొందవచ్చని అన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మోసం జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ఎల్ కౌన్సిలర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ

# పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736 250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులను సందర్శించి వంటశాల, ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. తదనంతరం కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు మంజూరైన భోజనశాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని రేగులగూడ గ్రామంలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలకు మంజూరైన అదనపు గదుల నిర్మాణ ప్రక్రియను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## కుక్కల దాడిలో 8 మందికి గాయాలు

(మొదటిపేజీ తరువాయి)

సదయ్య,రాజేశ్వరి, రాజేష్ సునీల్, శ్వేత,శోభ, స్వర్ణలత నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు వెంటపడి దాడి చేశాయి. బాధితులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేసుకున్నారు. వీరిలో తీవ్రంగా గాయపడిన సదయ్య, రాజేష్, లక్ష్మణ్ లను బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు పిహెచ్సి వైద్యురాలు లక్షి ్మ ప్రసన్న తెలిపారు. కుక్కల బెడత నుండి రక్షి ంచాలని స్థానికులు కోరుతున్నారు.

## పంట ఉత్పత్తుల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు టోకెన్లు జారీ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా కొనుగోలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 23 వేల ఎకరాలను పత్తి సాగు చేసే అవకాశం ఉందని, పంట దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కొరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, జిల్లాలోని రైస్ మిల్లులకు 1 మెట్రిక్ టన్నుల సామర్థం ఉందని తెలిపారు. పంట ఉత్పత్తులను రైతుల వద్ద నుండి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేసి సకాలంలో సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో పంట ఉత్పత్తుల కొనుగోలు కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కేంద్రాల ఏర్పాటులో నిబంధనలను పాటించాలని తెలిపారు. పంట విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని, టార్పాలిన్లు, గోనె సంచులు, తేమ, తూకం యంత్రాలు అవసరమైన మేర సమకూర్చాలని, హమాలీల సంఖ్య అనుగుణంగా ఉండేలా పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హత గల రైతులకు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :



కొత్తపల్లి వెంకటలక్ష్మి -చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వారి ఆధర్వంలో అందిస్తున్న సేవలను ప్రలందరూ సద్వినియోగం చేసుకోవాలని సొసైటి వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ డాక్టర్ అనిత అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కీమ్స్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రిలో ప్రతి మంగళవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షలో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణా, భోజనం సదుపాయం కల్పించి మంగళవారం 14 మందికి ఆపరేషన్ కోసం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సొసైటి ద్వారా గత తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి ఉచితంగా ఆపరేషన్ చేయించామని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఆపరేషన్ చేయించికొని లబ్ధి పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అయ్యన్న గారి భూమన్న, మనోహర్ గౌడ్,గోపి, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

ఆసిఫాబాద్, ప్రభాతవార్త :



జిల్లా కేంద్రంలోని ఉత్తర వాహిని పెద్దవాగు నది తీరాన ఉన్న 41 అడుగుల అభయాంజనేయ స్వామి భారీ విగ్రహం 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వఝుల శిరీష్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మాడుగుల నారాయణమూర్తి, నిమ్మకంటి మహేష్ శర్మ, ఢిల్లీ విజయ్ కుమార్ లు స్వామివారికి స్వస్తి పుణ్యాహవాచనం, నవగ్రహ స్థాపన పూజలు, రుద్రాభిషేకం నిర్వహించి మాన్యుసూక్త హవనం చేసి పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా పూర్తిచేశారు. అనంతరం ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ పూజల్లో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు, భాజపా జిల్లా నాయకులు ఆరిగెల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర శ్యాం నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలువేరు వెంకన్న, గాదివేణి మల్లేష్, మాజీ ఎంపీపీ బొమ్మెన బాలేశ్వర్ గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాపర్తి రవికుమార్, సీఐ బాలాజీ వరప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు ,ప్రధాన కార్యదర్శి గుండా వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## వివాదస్పదంగా గుండేపల్లి స్కూల్ వంటగది నిర్మాణం

పెంచికల్‌పేట్, ప్రభాతవార్త



మండలంలోని గుండేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంటగది నిర్మాణానికి చేపట్టిన పనులు వివాదాస్పందంగా మారాయి. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించేందుకు వంటగది నిర్మాణం కోసం గుంతలు తవ్వగా, ఫారెస్ట్ శాఖ అధికారులు రాత్రి సమయంలో ఆ గుంతలను మట్టితో పూర్తిగా కప్పివేశారు. ఈ ఘటనపై గ్రామ సర్పంచుకు గానీ, గ్రామ పెద్దలకు గానీ ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులను నిలదీయగా, రేంజర్ ఆదేశాల మేరకే ఈ చర్య తీసుకున్నాం అంటూ సమాధానం ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. దింతో తీవ్ర అసంతృప్తికి గురైన గ్రామస్థులు, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులకు ఈ విధంగా అడ్డంకులు సృష్టించడం అన్యాయమని స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని చిన్నారుల భవిష్యత్తుకు సంబంధించిన పనుల్లో సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని, అధికారుల నిర్లక్ష్యం వాళ్ళ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ ఘటనపై ఉన్నత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## హాల్‌టికెట్లలో తప్పులు ఉంటే సవరించుకోవాలి

**- జనహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ**

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పీ.ఎం శ్రీ జవహర్ నవోదయ కాగజ్‌నగర్ విద్యాలయంలో 9,11వ తరగతిలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు ఉంటే సవరించుకోవాలని కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదిన జరిగే పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లు సంబంధిత విద్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌లో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే తగిన ఆధారాలు విద్యాలయంలో సమర్పించి సవరించుకోవచ్చని తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం ఆసిఫాబాద్‌లో 5 పరీక్ష కేంద్రాలు, 11వ తరగతి కోసం కాగజ్‌నగర్‌లో 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించి అధికాలకు శిక్షణ, ఇతర ఏర్పాట్లు పూర్తయినట్లు పేర్కొన్నారు.

# నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలి

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**



**నస్పూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**

ఆర్.కె 7, ఆర్.కె న్యూ టెక్, ఎస్సార్పీ 1 గనుల ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకుని మిగతా గనుల ఉద్యోగులు రాబోయే కాలంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏరియా ప్రగతిపై ఆయన ప్రకటన విడుదల చేస్తూ జనవరిలో 5,73,700 టన్నుల లక్ష్యానికి గాను 2,32,279 టన్నుల బొగ్గు వెలికితీసి 40 శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఏరియాలోని ఆర్.కె 7, ఆర్.కె న్యూ టెక్, ఎస్ఆర్పీ 1 గనులు వంద శాతానికి పైగా బొగ్గును వెలికితీశాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఆర్.కె న్యూటెక్ గని 113 శాతం ప్రగతిని నమోదు చేసిందని తెలిపారు. ఆర్.కె 5, ఆర్.కె 7, ఎస్సార్పీ 1 గనులు కూడా పూర్తి స్థాయి లక్ష్యాన్ని సాధించే దిశగా ఉన్నాయని వెల్లడించారు. ఉపరితల గనులలో ఓబీ కాంట్రాక్టర్ల ఒప్పంద సమస్యల వల్ల ఉత్పత్తిలో కొన్ని ఇబ్బందులు ఎదురైనట్లు చెప్పారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో హెచ్పీపీఎల్ కొత్త కాంట్రాక్టు సంస్థ పనులు చేపట్టి ప్రతిరోజూ సగటున 37 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగిస్తోందని వివరించారు. రెండో కాంట్రాక్టుకు సంబంధించి సాంకేతిక బిడ్ ప్రక్రియ పూర్తయిందని, ధరల బిడ్ తెరిచి త్వరగా పనులు మొదలుపెడతామని తెలిపారు. ఇందారం ఉపరితల గనిలో పాత కాంట్రాక్టర్ యంత్రాలు ఏర్పాటు చేయడంలో వైఫల్యమవడంతో నూతన కాంట్రాక్టు కోసం ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా మెడికల్ ఇన్వాలిడేషన్ పొందిన 3,882 మంది వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు వివరించారు. మరో 275 మందికి ఎల్ఎస్పీ, 13 మందికి ఎంఎంసీ నిధులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన 9,729 మంది మాజీ ఉద్యోగులకు సీపీఆర్ఎంఎస్ కింద వైద్య కార్డులు అందజేశామని చెప్పారు. ప్రగతి స్టేడియంలో 77వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద యాజమాన్యం ఆధ్వర్యంలో సమ్మక్క సారలమ్మ జాతర జరిగిందని మునిగంటి శ్రీనివాస్ వివరించారు.




## చిత్తడి నేలల పరిరక్షణపై విద్యార్థులకు క్షేత్ర పర్యటన

**సారంగాపూర్, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:**

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా మంగళవారం జామ్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ అటవీ క్షేత్రాధికారి రామకృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతలో చిత్తడి నేలల ప్రాముఖ్యతను, వాటి సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. జీవవైవిధ్యం కాపాడటంలో చిత్తడి నేలలు కీలక పాత్ర పోషిస్తాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి చిత్తడి నేలలను ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప అటవీ క్షేత్రాధికారి మహమ్మద్ నజీర్ఖాన్, ఎఫ్ఎస్ఓ రషీద్, ఎఫ్బీఓలు సుజాత, వెన్నెల, స్రవంతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జైనూర్‌లో రేపు విద్యుత్ లోక్ అదాలత్

**జైనూర్, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయంలో ఈ నెల 4న విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఆసిఫాబాద్ సబ్ డివిజన్ డీఈ బండ వీరేశం తెలిపారు. బుధవారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులకు సంబంధించిన సమస్యలు, ఇతర విద్యుత్ సమస్యలను ఈ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఆసిఫాబాద్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, వీఆర్వోలు పాల్గొంటారని తెలిపారు.

## 33 ఏళ్ల తర్వాత ఒక్కటైన పూర్వ విద్యార్థుల బ్యాచ్

**సారంగాపూర్, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992-93 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. మంగళవారం అడెల్లి పోచమ్మ దేవాలయ పరిసర ప్రాంతాల్లో వీరు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి మిత్రులందరూ ఇన్నేళ్ల తర్వాత కలుసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఒక్కొక్కరు ఒక్కో రంగంలో స్థిరపడగా, తమ పిల్లల చదువులు, ప్రస్తుత జీవనశైలి గురించి ఆప్యాయంగా చర్చించుకున్నారు. పాఠశాల రోజుల్లోని తమ తీపి గుర్తులను నెమరువేసుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. ప్రతి సంవత్సరం ఇలాగే కలుసుకోవాలని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



## ఫోటో వీడియోగ్రఫీ సంఘం జిల్లా ఉప కార్యదర్శిగా పోతు వేణు గోపాల్

**జన్నారం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఫోటో, వీడియోగ్రాఫర్ జిల్లా కార్యవర్గ సమావేశంలో జన్నారం మండలానికి చెందిన పోతు వేణు గోపాల్ జిల్లా ఉప కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అప్పాసు రామన్న చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. జిల్లా ఉప కార్యదర్శిగా నియమితులైన పోతు వేణు గోపాల్‌ను జన్నారం మండల అధ్యక్షులు దుమల్ల ప్రశాంత్, తోటి సభ్యులు అభినందించారు.



## అటవీ అధికారులను అడ్డుకున్న ఇంధనపల్లి గ్రామస్తులు

**జన్నారం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**

జన్నారం మండలం ఇంధన పల్లి గ్రామ ప్రధాన రహదారిపై అటవీశాఖ ఉన్నత అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. మంగళవారం నాడు ప్రధాన రహదారిపై వెళ్తున్న అటవీశాఖ ఉన్నత అధికారులను వారు అడ్డుకొని తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ పశువులను అడవిలోకి పోనివ్వడం లేదని, అందువల్ల పశువులకు పశుగ్రాసం దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను తీసుకురానీయడం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## డిపో పరిధిలోని దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ బస్సు డిపో పరిధిలోని ఆసిఫాబాద్, కాగజనగర్, కౌటాల, బెల్లంపల్లి బస్టాండ్లో ఖాళీగా ఉన్న స్టాల్ నందు వ్యాపారం చేసుకునేందుకు టెండర్ లను ఆహ్వానిస్తున్నట్లు బస్సు డిపో మేనేజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి టెండర్ ఫామ్ లను విక్రయించేదుకు ఈ నెల 19న చివరి తేదీయని, మరింత సమాచారం కొరకు డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించగలరని కోరారు.




## ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోవాలి: బలరాం జాదవ్

**నేరడిగొండ, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:**

సోనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు మోటివేషనల్, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. కచ్చకాయల హరీష్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు రాబోయే బోర్డు పరీక్షల కోసం ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేసిన హరీష్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, స్వీకర్లు సంతోష్, శుద్ధోదన్, యోగితా, ఉపాధ్యాయులు ఒర్స శ్రీనివాస్, సంతోష్, సుభాష్ సూర్య, మునిగేల శ్రీధర్, బోరె రవిందర్, నాగరాజు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## నిర్మల్ పుర ఎన్నికల ప్రచారంలో గ్రామ స్థాయి నాయకుల సందడి

**సారంగాపూర్, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:**

నిర్మల్ పురపాలక ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకోవడంతో రాజకీయ సందడి పెరిగింది. నిర్మల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, మండల స్థాయికి చెందిన అన్ని పార్టీల నాయకులు తమ అభ్యర్థుల గెలుపు కోసం పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలోని 42 వార్డులలో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఓటు వేయాలని కోరుతూ ఇంటింటికీ తిరుగుతున్నారు. పార్టీల వారీగా కొందరు నాయకులకు ప్రత్యేకంగా వార్డులను కేటాయించడంతో, వారు ఆయా ప్రాంతాల్లోనే ఉంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. గతంలో కేవలం పట్టణ నాయకులు, కార్యకర్తలు మాత్రమే ప్రచారంలో కనిపించేవారు. కానీ ఈసారి గ్రామ స్థాయి నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రచారంలో పాలుపంచుకోవడం విశేషం. దీంతో నిర్మల్ పట్టణ వీధులన్నీ ఎన్నికల కోలాహలంతో నిండిపోయాయి.



### ప్రేరణ కార్యక్రమంతో విద్యార్థుల్లో

# ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

### – విద్యాలయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ ప్రభాకర్



మాట్లాడుతున్న విద్యాలయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**

ప్రేరణ కార్యక్రమంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్‌లోని పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రేరణ ఉత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాలయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ, మండల విద్యాధికారి ప్రభాకర్, జిల్లా అకాడమిక్ క్వాలిటీ అధికారి యు. శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రేరణ కార్యక్రమం ద్వారా నిర్వహించే ఈ పోటీలు విద్యార్థులకు మంచి అవకాశం కల్పిస్తాయని, జిల్లా స్థాయి నుంచి ఒక బాలుడు, ఒక బాలికను ఎంపిక చేస్తామని తెలిపారు. వికసిత భారత్ ఎలా ఉండాలో విద్యార్థులకు తెలియజేయడానికి ఇది మంచి సదవకాశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ విద్యాలయాల నుంచి 276 మంది బాలురు, 155 మంది బాలికలు కలిపి మొత్తం 461 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో ఎంపికైన 36 మంది విద్యార్థినీ,విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవితలు, వ్యాస రచనలు, ఉపన్యాసాలు, చిత్రలేఖనం, గాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డిగ్రీ కళాశాల ఉప ప్రధానాచార్యులు లక్ష్మీ నరసింహం, జనార్ధన్, ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాల ప్రధానాచార్యులు రమేష్ రావు, అలాగే అధ్యాపకులు రామయ్య, రా ఛ, పి. కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ప్రేరణ కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులను గుజరాత్ రాష్ట్రంలోని వడ్నగర్ పట్టణానికి తీసుకువెళ్లి అక్కడి చారిత్రక ప్రాంతాలను అధ్యయనం చేసే అవకాశం కల్పిస్తామని ప్రధానాచార్యులు రేపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, అవసరమైన రాకపోకల ఖర్చులను నవోదయ విద్యాలయం భరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## యువత స్వయం ఉపాధి మార్గం వైపు వెళ్ళాలి

### - శిక్షణ తరగతులు పరిశీలించిన సింగరేణి అధికారులు

**మందమర్రి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణం సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ యోగా హాల్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తరగతులను మందమర్రి ఏరియా డి.జి.ఎం పర్సనల్ సిహెచ్. అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణలు శుక్రవారం బ్యూటీషియన్ శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు శిక్షకులతో మాట్లాడి వివిధ కోర్సుల నిర్వహణ, శిక్షణ విధానం, శిక్షార్థుల సంఖ్య తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. కోర్సులు పూర్తి చేసిన అనంతరం శిక్షార్థులు స్వయం ఉపాధి మార్గంలో ముందుకు సాగాలని, ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని వారు తెలిపారు. ఇలాంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా మహిళలు, యువత ఆర్థికంగా స్వావలంబన సాధించాలని వారు ఆకాంక్షించారు.

## కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ

**జన్నారం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**



జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలను మధ్యాహ్న భోజనం సోషల్ ఆడిట్‌లో భాగంగా ఇన్వేస్టిగేటర్ ఎండి సాజిద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇట్టి తనిఖీల్లో రిజిస్టర్లు రికార్డ్స్ క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు అందించే భోజనం గురించి ఉపాధ్యాయులను,విద్యార్థులను, భోజన నిర్వహకురాలిని వివిధ ప్రశ్నలు అడుగుతూ మధ్యాహ్న భోజనం అమలు తీరును తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ సుధాకర్ నాయక్, నాగలక్ష్మి, సిఆర్‌పి నీలం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సహజ వ్యవసాయంతో స్థిరమైన ఆదాయం

**వేమనపల్లి, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త**

వేమనపల్లి రైతు వేదికలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పై రైతులకు మండల వ్యవసాయ అధికారులు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకంపై రైతులకు ఏవో సోదారి వీరన్న అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులకు వేప నూనె (నీమ్ ఆయిల్) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ... ఆయిల్ పామ్ పంట సాగు విధానం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, అలాగే నేషనల్ మిషన్ ఆన్ ఫార్మింగ్ ద్వారా రైతులు సహజ వ్యవసాయాన్ని అవలంబించడం వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. రైతులకు పంపిణీ చేసిన వేపనూనె ఉపయోగాలపై అవగాహన కల్పించారు. వేప నూనెను సహజ పురుగుమందుగా ఉపయోగించవచ్చని, ఇది పంటలపై పురుగులు, చీడపీడలను నియంత్రించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే ఇది పర్యావరణానికి హాని కలిగించదని, నేలలోని ఉపయోగకారి సూక్ష్మజీవులను కాపాడుతుందని పేర్కొన్నారు. ఈ సహజ వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ వ్యయంతో స్థిరమైన ఆదాయం సాధించవచ్చు అని చెప్పారు. నేల ఆరోగ్యం పరిరక్షించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయవచ్చని అధికారులు రైతులకు సూచించారు. వేప నూనె వినియోగం ద్వారా రసాయనాలపై ఆధారపడటం తగ్గి, సహజ వ్యవసాయం మరింత బలపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రోక్సర్ సుల్తానా గ్రామ సర్పంచ్ వుప్పులపు సాయికృష్ణ, మాజీ సర్పంచ్ తోకల రామచందర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



రైతులకు వేప నూనె పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు



కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేసిన తహసీల్దార్

## పెంచికల్‌పేట్‌లో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా లబ్దిదారులకు మంజూరైన చెక్కులను తహసీల్దార్ తిరుపతి పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని 11 మంది లబ్దిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను అందజేశామని తెలిపారు. లబ్ధిదారులు అందుకున్న ఆర్థిక సహాయాన్ని స్వద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాంచందర్, పోశన్న, ఆర్ఐ రాజేశ్వర్, నాయకులు గణపతి, వెంకటాచలం, నగేష్, మహేష్, ప్రభాకర్, పురుషోత్తం, ప్రకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం కప్ రెండో విడత క్రీడా పోటీలు ప్రారంభం

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో స్థానిక ఎంజెపి బాయ్స్ నందు సీఎం కప్ రెండో విడత క్రీడా పోటీలను మండల విద్యాధికారి జి. శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి ఒక్కరు క్రీడా పోటీలలో పాల్గొని విజయం సాధించాలని, గెలుపోటములను పక్కన పెట్టి క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె. రామ్మోహన్ రావు, బండ జీవరత్నం, నాంపల్లి రాజేష్, ఇందిర, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త**

పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మట్ మంగళవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల యందలి రికార్డులు, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, పదవ తరగతి విద్యార్థుల ప్రగతి, హాస్టల్లోని వంటగది, ఆర్ఓ ప్లాంట్, మధ్యాహ్న భోజనం, సిక్ విద్యార్థుల వివరాలు తనిఖీ చేసి సంతృప్తి చెందారు. సీఎం కప్ 2026 సంబంధించి ఎంజెపి పాఠశాలలో జరిగిన క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఇదే ఉత్సాహంతో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో గెలిచి పాఠశాలకు జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగు సత్యనారాయణ, జిల్లా క్రీడాల అభివృద్ధి అధికారి బండ జీవరత్నం, వార్డెన్ రేవతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా సమస్యలను వెలికితీయడంలో పత్రికలు ముందుండాలి

జన్నారం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త

ప్రజా సమస్యలను వెలికితీయడంలో పత్రికలు ముందుండాలని, మీరు పత్రికల్లో ప్రచురించడం వల్లనే వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి చేరి అవి పరిష్కారం అవుతాయని అన్నారు. మంగళవారం నాడు మాజీ జెడ్పి టిసి ఎర్ర చంద్రశేఖర్ వార్త క్యాలెండర్‌ను తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియచేయడంలో వార్త దినపత్రిక ఎప్పుడూ ముందుంటుందని, అవినీతి విషయాలను నిర్భయంగా పత్రికల ద్వారా ప్రజలకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజు, రైతు నాయకులు అల్లం లచ్చన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యం రాజన్న పాల్గొన్నారు.

## మిషన్ టెన్త్ క్లాస్-చదువుకో తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ

### - ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహం

మందమర్రి, పిబ్రవరి 3, ప్రభాతవార్త



మందమర్రి మండలం పొన్నారం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులను చదువులో ప్రోత్సహించే లక్ష్యంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మిషన్ టెన్త్ క్లాస్–చదువుకో తెలంగాణ" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ను పొన్నారం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు విజయ్ రఫేల్ రెడ్డి, పొన్నారం గ్రామ సర్పంచ్ పెంచాల మధు, ఆదిల్పేట్ గ్రామ సర్పంచ్ నేండుగురి పున్నం కలిసి, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పేట ప్రసాద్, డెవలప్మెంట్ ఆఫీసర్, శెట్టి సత్యనారాయణ ఫీల్డ్ అసిస్టెంట్, గౌరవ జిల్లా అధ్యక్షులు ఈద లింగయ్య సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విజయ్ రఫేల్ రెడ్డి మాట్లాడుతూ, పేద విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.2.2 కోట్ల వ్యయంతో అమలు చేస్తున్న ఈ కార్యక్రమం అత్యంత ప్రశంసనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా ఈ "మిషన్ టెన్త్ క్లాస్ - చదువుకో తెలంగాణ" కార్యక్రమం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరిగి, ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ముందడుగు పడుతుందని వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

### - తహసిల్దార్ మధుకర్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :

ప్రజా పంపిణీ పథకంలో లబ్ధిదారులకు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసిల్దార్ మధుకర్ అన్నారు మంగళవారం కాగజ్నగర్ పట్టణంలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌక ధరల దుకాణం నెం. 2405041 నందు రేషన్ కార్డు లబ్ధిదారులకు సంబంధించి ఈ కేవైసీ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకుఈ కేవైసీ ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. రేషన్ కార్డు లబ్ధిదారులందరూ తప్పనిసరిగాఈ కేవైసీ నమోదు పూర్తి చేయాలని, నిర్ణీత గడువు లోపల ఆధార్‌ను రేషన్ కార్డుతో లింక్ చేయాలని సూచించారు. ఆధార్–రేషన్ లింకింగ్ ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తుందని, నకిలీ లబ్ధిదారుల నివారణతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఆహార భద్రత పథకాలు సకాలంలో అందుతాయని వివరించారు.



# గంగాపూర్ జాతర నిర్వహించడంలో అధికారుల నిరక్ష్యం

రెబ్బెన, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త

మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా రెబ్బెన మండలంలోని గంగాపూర్ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు మూడు రోజులపాటు నిర్వహించిన జాతరలో పాలకులు, దేవాదాయ శాఖ అధికారులు నిరక్ష్యంగా వ్యవహరించి భక్తులను ఇబ్బందులకు గురి చేశారని ఆత్మ నిర్భర్ భారత్ బిజెపి కొమురం భీం జిల్లా కన్వీనర్ కేసరి ఆంజనేయులు గౌడ్ బిజెపి జిల్లా కోశాధికారి కొలిపాక కిరణ్ కుమార్ అన్నారు రెబ్బెనలో విలేకరులతో మాట్లాడుతూ మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించే జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చి వెంకటేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకుంటారని ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులు సరియైన సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా నిరక్ష్యంగా వ్యవహరించడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారని అన్నారు జాతరలో భక్తులకు సరిపడా తాగునీరు, విశ్రాంతి కేంద్రాలు,



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

మరుగుదొడ్లు, లేక భక్తులు ఇబ్బంది పడ్డారని ముందస్తు ప్రణాళిక లేక జాతర నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్యతో గంగాపూర్ రైల్వే గేట్ నుండి దేవాలయం వరకు గంటల తరబడి రోడ్డుపైనే వాహనాలు నిలిచిపోవలసి వచ్చిందని దీంతో భక్తులు అవస్థలకు గురయ్యారని రాజకీయ జోక్యంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు వారి కార్యకర్తలను అనుచరులను బంధువులను వరుసలో నిలుచకుండానే డైరెక్టుగా గుడి లోపలికి తీసుకెళ్లడం వల్ల సాధారణ భక్తులు గంటల తరబడి వరుసలో నిలుచొని వెంకటేశ్వర స్వామి ని దర్శించేందుకు అవస్థలు పడ్డారని భక్తుల కోసం ఉన్న పవిత్ర ఆలయాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రదర్శనకు వేదికగా మార్చి భక్తులకు ఇబ్బందులు కల్పించారని విమర్శించారు దేవాలయానికి భక్తులు ఇచ్చే కానుకల ద్వారా వాణిజ్య లైసెన్సుల ద్వారా దర్శన టికెట్ల ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా భక్తులకు సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు అధికారుల నిరక్ష్యంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు గంగాపూర్ రైల్వే గేట్ నుండి దేవాలయం వరకు రెండు వరసల రహదారి నిర్మించాలని కోరారు.



## పాఠశాల తనిఖీ చేసిన ఎంపీడీవో

తాండూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త

మండలంలోని కర్నలఘట్టం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన, మధ్యాహ్నం భోజనం అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంట తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, నాయకులు పురంశెట్టి అరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



## ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేసిన ఆదివాసి విద్యార్థి సంఘం

సిరికొండ, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:

మండలంలోని రాయిగూడ ఎంపీపీఎస్ పాఠశాలను ఆదివాసి విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు మహేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంటగది లేకపోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వంటగది సౌకర్యం లేకపోవడంతో మధ్యాహ్న భోజనాన్ని ఇళ్ల వద్ద వండి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిరక్ష్యం వల్లే పాఠశాలల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించకపోవడం వల్లే మౌలిక వసతులు క్షీణించి పాఠశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని ఆరోపించారు. వెంటనే పాఠశాలలో వంటగదిని నిర్మించి, విద్యార్థులకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులను వార్షిక పరీక్షలకు ప్రోత్సహించేలా ప్రత్యేక ప్రేరణ అవగాహన తరగతులు

### - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య

మంచిర్యాల, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త

10వ తరగతి చదువుతున్న విద్యార్థులను వార్షిక పరీక్షలకు ప్రోత్సహించేలా ప్రత్యేక ప్రేరణ అవగాహన తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ఎటిడిఓ సురేష్, టి.ఎన్.జి.ఓ.స్ ప్రతినిధి గడియారం శ్రీహరి, మానసిక వైద్య నిపుణులు సునీల్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణఅవగాహన తరగతులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, ఇష్టంతో చదివి, పట్టుదలతో సాధించి ఉన్నత స్థానాలలో నిలవాలని, తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ప్రేరణఅవగాహన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, విషయ నిపుణులైన ఉపాధ్యాయులు ఇచ్చే మెలకువలను పాటించి, అన్ని సబ్జెక్టులలో 100 శాతం మార్కులు సాధించాలని, వార్షిక ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణతతో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ధర్మానంద్ గౌడ్, ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

